క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.60 లక్షల మంజూరు



నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ సూర్యప్రకాష్‌

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న సోమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. సదరు చెక్కును బుధవారం వైఎస్సార్‌ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ సూర్యప్రకాష్‌ సుందర పల్లి గ్రామ పెద్దలకు అందించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీటీసీ అడపా నారాయణస్వామి, పెద్దలు సాదు, సీరెడ్డి సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సత్కారం



వెంకటాయపాలెంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ శివగణేష్‌ను సత్కరిస్తున్న బీసీ నాయకులు

రామచంద్రపురం రూరల్‌: డ్రైవర్స్‌ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండలంలోని వెంకటాయపాలెంలో ఆర్టీసీ బస్సును నిలిపి డ్రైవర్‌ కాండ్రేగుల శివగణేష్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన బీసీ నాయకుడు రాయుడు చంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ నాయకులు కట్టా సూర్య నారాయణ, మేడిశెట్టి శేషారావు, మాగాపు అమ్మిరాజు, కడలి రాంపండు, దొమ్మేటి సుధాకరరావులు డ్రైవర్‌ను దుశ్శాలువా, పూల దండలతో సత్కరించి డ్రైవర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన



వ్యవసాయంపై అవగాహన కోసం ఫీల్డ్‌ విజిట్‌కు వెళ్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్‌: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులకు బుధవారం వ్యవసాయంపై అవగాహన కల్పించే విధంగా అగ్రికల్చరల్‌ ఒకేషనల్‌ ట్రైనర్‌ కొప్పిశెట్టి కల్యాణి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఫీల్డ్‌ విజిట్‌కు ద్రాక్షారామలోని పైండా జమీందారులకు చెందిన వ్యవసాయ భూమి వద్దకు తీసుకువెళ్లి వివిధ రకాల సాగులు, వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయిని వాడ్రేవు రత్నపద్మావతిలు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్‌ పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ పిల్లి సూర్యప్రకాష్‌

రామచంద్రపురం రూరల్‌: మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్‌ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు జిల్లా ప్రజాపరిషత్‌ అందజేసిన విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ కోఆర్డినేటర్‌ పిల్లి సూర్యప్రకాష్‌ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యప్రకాష్‌ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల చదువులపై ఎనలేని శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్‌, సర్పంచ్‌ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీటీసీ యెన్నం దేవి, ఉప సర్పంచ్‌ నీల దేవీభవాని, పేరెంట్స్‌ కమిటీ చైర్మన్‌ యెరుబండి నాగేశ్వరరావు, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్‌, వి.నాగేశ్వరి, గ్రామ పెద్దలు సూరంపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థి ప్రతిభ

మామిడికుదురు: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీలో మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కేపీఎస్‌ఎస్‌ శ్రీరామ్‌ ద్వితీయ బహుమతిని సాధించాడు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం -1994లో భాగంగా 'ఆడ శిశువును కాపాడుదాం -సృష్టిని రక్షిద్దాం' అనే నినాదంతో వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో శ్రీరామ్‌ ద్వితీయ బహుమతిని సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిరంజని బుధవారం తెలిపారు.

ప్రయోగాలతో ప్రగతికి బాట



జువాలజీ పాఠ్యాంశాన్ని స్లైడ్‌ చూపిస్తూ వివరిస్తున్న అధ్యాపకురాలు వీరలక్ష్మి

- ఫిబ్రవరి 11 నుంచి 20 వరకూ ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు
- ప్రయోగాంశాలపై అవగాహన అవసరం
- రెండు నియోజకవర్గాల్లో 17 కేంద్రాలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న అధ్యాపకులు

కపిలేశ్వరపురం: ఇంటర్మీడియట్‌ చదువులో ప్రాక్టికల్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంది. తరగతి గదిలో విన్న, చదివిన పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించాల్సి ఉండడంతో విద్యార్థుల్లో సహజంగా భయం, ఆందోళన కలుగుతుంది.. విద్యార్థులకు ప్రశ్నా పత్రంపైనా, మార్కులు కేటాయింపు పైనా, ప్రయోగం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా విద్యార్థులకు అవగాహన అవసరం. వారికి భరోసా ఇస్తూ అధ్యాపకులు చేస్తున్న సూచనలపై ఈ కథనం..

రెండు నియోజకవర్గాల్లో పరీక్షల తీరు ఇలా..

విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతి జూనియర్‌ కళాశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసింది. దీంతో మండపేటలో 6, కపిలేశ్వరపురం 1, రాయవరం 2, రామచంద్రపురం 4, కె.గంగవరంలో 3, కాజులూరులో ఒకటి మొత్తం 17 కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటలు వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ రెండు విడతలుగా పరీక్షలను నిర్వహించనున్నారు.

డయాగ్రమ్‌లను సరిగ్గా వేయాలి



జువాలజీలో ప్రయోగ పరీక్ష మూడు భాగాలుగా ఉంటుంది. పటాన్ని గుర్తించి భాగాలను రాయాల్సి నందుకు ఆరు మార్కులు, ప్రయోగాంశాలు చేసినందుకు ఐదు మార్కులు ఉంటాయి. ఇచ్చిన స్పెసిమెన్స్‌, స్లైడ్స్‌లను గుర్తించడం, వాటికి పటాలను గీయడం, వాటిలోని భాగాలను రాసినందుకు 14 మార్కులు ఉంటాయి. రికార్డు రాసినందుకు 5 మార్కులు మొత్తం 30 మార్కులుంటాయి.

– వి.వీరలక్ష్మి, జువాలజీ అధ్యాపకురాలు, అంగర

శాస్త్రీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రయోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేయాలి. సెక్షన్‌-ఎ లో వర్గీకరణ శాస్త్రం సెక్షన్‌-బి లో అంతర్‌ నిర్మాణ శాస్త్రం, సెక్షన్‌-సి లో లైవ్‌ ఎక్స్‌పర్మెంట్‌ పేరుతో ప్రయోగం ఉంటాయి. ఒక్కోదానికి ఆరు చొప్పున 18 మార్కులొస్తాయి. నమూనాల పరిశీలనకు ఐదు, రికార్డు రాసినందుకు ఐదు, హెర్బేరియంకు రెండు మొత్తం 30 మార్కులుంటాయి.

– చుక్కా సురేష్‌ కుమార్‌, బోటనీ అధ్యాపకుడు, కె.గంగవరం

మూలకాల చర్యలపై అవగాహన ఉండాలి



మూలకాల చర్యలపై అవగాహనతో ప్రయోగాన్ని చేయాలి. లవణ గుణాత్మక విశ్లేషణా విధానానికి 10 మార్కులు, ఘన పరిమాణాత్మక విశ్లేషణ విధానానికి 8, కార్బోహైడ్రేట్స్‌, ప్రొటీన్స్‌ లేదా కొలైడ్‌, ఆర్గానిక్‌ కాంపౌండ్స్‌, క్రొమెటోగ్రఫీ ద్రావణాలకు 6 మార్కులు ఉంటాయి. రికార్డు, వైవా, ప్రాజెక్టులకు రెండు చొప్పున ఆరు మార్కులుంటాయి.

– వేల్పూరి శ్రీదుర్గా రఘురాం, అధ్యాపకుడు, కెమిస్ట్రీ, మండపేట

పరిసరాలపై అవగాహన అవసరం



ప్రయోగం చేసేటపుడు పరిసరాలపై అవగాహన ఉంటే విలువలు సరిగ్గా వస్తాయి. ఫిజిక్స్‌లో 20 ప్రయోగాంశాలకు 38 ప్రశ్నలుగా ఉంటాయి. వాటిని చదువుకుని తర్ఫీదు పొందాలి. వాటిలో ఎంపిక చేసిన ఒక అంశానికి ప్రయోగం చేయడం ద్వారా 21 మార్కులు పొందుతారు. అందులో ఫార్ములాలు, టేబుల్‌, గ్రాఫ్‌లను వేయాల్సి ఉంటుంది. రికార్డు రాసినందుకు నాలుగు, వైవాకు ఐదు మొత్తం 30 మార్కులుంటాయి.

– బలుసు ధన ప్రసాదరావు, అధ్యాపకుడు, భౌతిక శాస్త్రం, అంగర

ప్రజాభీష్టానికి అనుగుణంగానే ప్రభుత్వ పాలన



కాజులూరు మండల పరిషత్‌ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌

- వాడీవేడిగా కాజులూరు మండల సమావేశం
- పలు శాఖల అధికారుల డుమ్మా.
- నోటీసులు జారీ చేయాలని ఎంపీ బోస్‌ ఆదేశం

కాజులూరు: రాష్ట్రంలో ప్రజాభీష్టానికి అనుగుణంగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన కొనసాగిస్తున్నారని అధికారులు దానికనుగుణంగా పని చేయాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ అన్నారు. బుధవారం కాజులూరు మండల పరిషత్‌ సమావేశ భవనంలో ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో ఎంపీ బోస్‌ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. పలు శాఖల మండల స్థాయి అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టగా పలు శాఖల నుంచి కింది స్థాయి సిబ్బంది హాజరయ్యారు. దీనిపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు కిందిస్థాయి సిబ్బంది సమాధానాలు చెప్పలేకపోవటంతో ఎంపీ బోస్‌ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు రూపొందిస్తున్నారని గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామీణ స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పథకాల అమలులో వలంటీర్ల వ్యవస్థ ద్వారా కుల, మత, పార్టీ భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో దాపరికం లేకుండా ప్రతీది ప్రజలకు తెలియజేస్తున్నారని అధికారులు దానికనుగుణంగా వ్యవహరించాలన్నారు. దాళ్వాలో సాగునీటి ఎద్దడి రాకుండా కాలువ శివారు భూములకు సాగునీరందేలా వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంగా కృషి చేయాలన్నారు. రానున్న వేసవి దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వారికి నోటీసులు ఇప్పించాలని ఎంపీడీఓ రత్నంరాజుని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్‌ ఎంపీపీలు రేఖాడి విజయ, పెదిరెడ్డి వెంకటరమణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరు– అచ్యుతాపురం రోడ్డుకు శంకుస్థాపన



చెల్లూరులో రహదారి అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చెల్లూరు వద్ద బుధవారం ఆర్‌ అండ్‌ బీ రహదారి పనులకు ఎమ్మెల్సీ త్రిమూర్తులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులు, మహిళలు, పేద, బడుగు, బలహీన, మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం ఆయన చెల్లూరు నుంచి కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం వరకూ ఉన్న ఆర్‌ అండ్‌ బీ రహదారిని రూ.90 లక్షల వ్యయంతో నిర్మాణం చేసే పనులకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వైట్ల వీరవేణి, సొసైటీ చైర్మన్‌ చిక్కాల శ్రీరాములు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ పాలిక శ్రీను, వైఎస్సార్‌సీ పీ నేతలు పాలిక గోవిందు, పలివెల రామకృష్ణ, కోటి అంబేద్కర్‌, పిల్లి సుబ్రహ్మణ్యం, చిక్కాల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జాతరలు సంస్కృతిలో ఒక భాగం

పోలమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు పూజలు



రాయవరంలో పోలమ్మ వారిని దర్శించుకుని పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: గ్రామాల్లో నిర్వహించే జాతరలు, ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరంలో కొప్పు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలమ్మ వారి జాతరలో త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో ఆయన పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో త్రిమూర్తులు మాట్లాడుతూ ఏటా పోలమ్మ అమ్మవారి జాతరను అత్యంత ఘనంగా కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కొప్పు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌ తేతల సుబ్బ రామారెడ్డిలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వెంకటరమణ, వైఎస్సార్‌ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పారిశ్రామికవేత్త కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (సత్తిబాబు), కేవీఆర్‌ ఆస్పత్రి అధినేత డాక్టర్‌ తేతల నవీన్‌రెడ్డి, అధిక సంఖ్యలో కొప్పు వెలమ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, వైఎస్సార్‌ సీపీ నేతలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళాభ్యుదయం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మహిళాభ్యుదయం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో బుధవారం ఆసరా లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ద్వారపూడి గ్రామంలోని మహిళా సంఘాలకు 4వ విడత సాయంగా రూ.1,21,54,377, కేశవరం గ్రామంలోని మహిళా సంఘాలకు రూ. 2,26,46,402 రుణం మాఫీ అయింది. ఆయా పంచాయతీల సర్పంచులు ఈత కోట కిన్నెర, పెదపాటి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్‌, ఎంపీడీఓ ఐదం రాజు, వైఎస్సార్‌సీ పీ రాష్ట్ర కార్యదర్శిలు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు రెడ్డి రాజుబాబు, యువనేత తోట పృథ్వీరాజ్‌, ఏఎంసీ చైర్మన్‌ సిరిపురపు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్‌ తులా శేషారావు, పీఏసీఎస్‌ చైర్మన్లు తులా రంగారావు, ముక్కపాటి శ్రీనివాస్‌, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ మాట్లాడారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానన్న మాటను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలుపుకున్నారన్నారు. నాలుగో విడత మాఫీ సొమ్మును ఖాతాలకు జమ చేసిన సందర్భంగా మహిళలు ఆనందంగా ఉన్నారన్నారు. సంక్షేమ పాలనకు నిలువుటద్దంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. డ్వాక్రా సంఘాలను తానే ఏర్పాటు చేశానంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడూ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసే చర్యలు చేపట్టలేదన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిపొందినవారు సంతోషంగా ఉండటం తమకు ఆనందాన్నిస్తుందన్నారు.

28న లొల్లలో ఉచిత వైద్య శిబిరం

రాయవరం: మండలంలోని లొల్ల విశ్వమానవత ఆశ్రమంలో ఈ నెల 28న ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి బుధవారం విలేకరులకు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కృత్రిమ కాళ్లు అమర్చడం, బధిరులకు వినికిడి యంత్రాలు అమర్చడం, స్పీచ్‌ థెరపీ అందిస్తామన్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన డాక్టర్‌ రఘునాథ్‌ అనే ప్రత్యేక వైద్య నిపుణుడి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. పుట్టుకతోనే దివ్యాంగులైనవారు, ప్రమాదవశాత్తూ కాళ్లు కోల్పోయిన వారు, పుట్టుకతోనే లేదా ప్రమాదవశాత్తూ, అనారోగ్యం కారణంగా అవయవాలు కోల్పోయి, ఆర్థిక పరిస్థితులు సహకరించక కృత్రిమ కాళ్లు పొందలేని వారికి ఈ వైద్య శిబిరంలో సేవలు అందిస్తామన్నారు. అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు అమర్చనున్నట్లు ఆయన తెలిపారు. బధిరులైన చిన్నారులకు వినికిడి పరీక్షలు, హియరింగ్‌ ఎయిడ్స్‌, స్పీచ్‌ థెరఫీ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలలోని దివ్యాంగ చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కేశవరంలో టీడీపీకి భారీ షాక్‌

- పెద్ద సంఖ్యలో టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కేశవరంలో పార్టీలో చేరుతున్నవారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ తోట



కేశవరంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కూర్మాపురం టీడీపీ నేతలు, కార్యకర్తలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గంలో టీడీపీ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వస్తోంది. మండపేట మండలం కేశవరం సర్పంచ్‌ పెదపాటి సత్యనారాయణ ఇటీవల టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనా తీరు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం పట్ల చూపుతున్న చొరవకు ఆకర్షితులైన గ్రామానికి చెందిన సుమారు రెండు వందల మంది బుధవారం సర్పంచ్‌ పెదపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాజకీయ కుటుంబాలతో పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, ఆటో కార్మికులు, శ్రామిక జనం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు వ్యవహార శైలి హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎప్పటి నుంచో తమ పార్టీలోనే తిరుగుతున్న వారికి కొత్తగా పార్టీ కండువాలు కప్పి గ్రామాల్లో తన ప్రాబల్యం ఉనికిలోనే ఉన్నట్టు నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారన్నారు. కేశవరంలో పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల వారూ తనను ఆదరించేందుకు పార్టీలో చేరడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఎప్పటిలాగే పార్టీ కార్యకర్తలను తన గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్‌, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, యువనేత తోట పృథ్వీరాజ్‌, ఏఎంసీ చైర్మన్‌ సిరిపురపు శ్రీనివాసరావు, పీఏసీఎస్‌ చైర్మన్లు ముక్కపాటి శ్రీనివాస్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు దొరాజీ, పెదపాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రాయవరం మండలం నుంచి..

రాయవరం: మండలంలోని కూర్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండపేట మండలం కేశవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌ చౌటుపల్లి చక్రవేణి, వైఎస్సార్‌సీపీ నేతలు చౌటుపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పరంశెట్టి వెంకటరమణ నేతృత్వంలో ఈ చేరికలు జరిగాయి. ఈ విషయాన్ని వెంకటేశ్వరరావు, వెంకటరమణ తెలిపారు. టీడీపీకి చెందిన మండపల్లి సతీష్‌, మండపల్లి రవి, పలివెల చిట్టిరాజు, పలివెల సువర్ణరాజు, దార్ల సుధీర్‌, ఆకుమర్తి చిట్టిబాబు తదితరులు వైఎస్సార్‌ సీపీలో చేరారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండపల్లి సతీష్‌ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాయవరం మండల సోషల్‌ మీడియా కన్వీనర్‌ తవిటికి రత్నకుమార్‌ వైఎస్సార్‌సీపీ నేతలు పలివెల రామకృష్ణ, చంద్రమళ్ల వీర్రాజు, పలివెల విజయకుమార్‌, చంద్రమళ్ల సుబ్రహ్మణ్యం, పులుగుర్త యాకోబు, పలివెల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నరజాడ-కూళ్ల రహదారికి మహర్దశ



రహదారి నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

కె.గంగవరం: మండలంలోని నరజాడ-కూళ్ల రహదారికి మహర్దశ పట్టింది. గత కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగా మారడంతో రెండు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రహదారి నిర్మించాలని అధికారులకు గ్రామస్తులు విన్నవించుకున్న పట్టించుకోలేదని వారు చెబుతున్నారు. అయితే ఇటీవల రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్‌ గ్రామ పర్యటన చేసే క్రమంగా రహదారి సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన బోస్‌ ఎన్‌ఆర్‌జీఎస్‌ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయడంతో పాటు రహదాని నిర్మాణ పనులు వెంటనే జరపాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. బుధవారం సదరు కాంట్రాక్టర్‌ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుని రోడ్డు తవ్వకం ప్రారంభించారు. నెల రోజుల్లో రహదారి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని కాంట్రాక్టర్‌ వాపోయారు. రహదాని నిర్మాణం జరగడంతో రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ బోస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత



మాచరలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): బాలికా సంరక్షణ అందరి బాధ్యత అని జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల, కేదారిలంక ప్రాథమికోన్నత పాఠశాలల్లో బాలికా హక్కులు, సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్లలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, శ్రమ కోఆర్డినేటర్‌ ఈశ్వరి పాల్గొన్నారు.

మాచవరంలో..

రాయవరం: మండలంలోని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. భేటీ పడావో..భేటీ బచావో కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం పి.జగన్మోహిని, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ఎన్‌వీ రమణాంజలి బాల్య వివాహాలు, రక్తహీనత గురించి విద్యార్థినులకు వివరించారు. అలాగే ఆహార, ఆరోగ్య విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం



మండపేటలో లబ్ధిదారుకు ఆరోగ్య వివరాల రిపోర్టును అందజేస్తున్న చైర్‌పర్సన్‌ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండపేట మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 8వ వార్డు హరిజన పేటలో పట్టణ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలను అందిస్తున్న తీరును పరిశీలించారు. రోగికి నిర్వహించిన పరీక్షల రిపోర్టులను లబ్ధిదారుకు అందజేశారు. దుర్గారాణి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వినియోగ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచడం పేదలందరికీ ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో జంగమ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ మీగడ శ్రీనివాసు, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్‌, చిట్టూరి సతీష్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు అమలదాసు రుద్రమూర్తి, డా.రమ్యలక్ష్మి, హెల్త్‌ సూపర్‌వైజర్‌ అనంతలక్ష్మి, సచివాలయ కన్వీనర్‌ జుత్తుక లీల, ఆసుపత్రి, సచివాలయ, మున్సిపల్‌ కార్యాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకట్రావు అన్నారు. మండలంలోని కూళ్లలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ ఇప్పటికే పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారన్నారు. దీంతో పాటు పశువుల దాణా, మందులు అందిస్తున్నారని, ఉచితంగా పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పాడి రైతులు వ్యవసాయంతో పాటు పాడిపశువులను సాకుతూ ఆర్థికంగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్‌ చిల్లే నాగేశ్వరరావు ప్రారంభించారు. పశువైద్యులు ఎం.బిందు, జి.సురేష్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.